# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 15-09-2025 సమయం : సాయంకాలం 6 గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- మానవీయ కోణంలో ప్రభుత్వ విధానాలను అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.
- విద్య ద్వారానే మహిళల సాధికారత సాధ్యం అవుతుందని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు.
- వాహన మిత్ర పథకానికి సంబంధించిన దరఖాస్తులను ఈనెల 17వ తేదీ నుంచి ప్రభుత్వం స్వీకరించనుంది.
- ఉత్తర కోస్తాంధ్రలో రేపు పలు చోట్ల తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ విభాగం వెల్లడించింది.

==================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈరోజు 4వ కలెక్టర్ల సదస్సు ప్రారంభమయ్యింది. ఈరోజు ముఖ్యంగా సంక్షేమ కార్యక్రమాలు, పీ4 మొదలగు అంశాలపై ముఖ్యమంత్రి కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమంపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారిస్తోందన్నారు. ప్రజల సాధికారిత కోసం ఎన్నికల్లో ఆరు హామీలు ఇచ్చి వాటిని సాకారం చేశామన్నారు. సమాజంలో సామాజిక అసమానతల కారణంగానే ఆర్థిక అసమానతలు వచ్చాయని వాటిని తొలగించేందుకే పీ4 లాంటి కార్యక్రమాన్ని తీసుకువచ్చామన్నారు. మానవీయ కోణంలో ప్రభుత్వ విధానాలను అమలు చేయాలని చంద్రబాబు నాయుడు కలెక్టర్లకు దిశానిర్దేశం చేస్తూ...

(వాయిస్ బైట్...25 సెకన్లు)

==================

సేవ, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు నిర్విరామంగా కృషి చేస్తోంది. సేవా పర్వ్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పలు అంశాలపై ఆకాశవాణి విశాఖపట్టణం ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. అందులో భాగంగా పర్యావరణ సమతుల్యత, సంరక్షణకు ప్రభుత్వం అనుసరిస్తున్న పలు విధానాలపై ఒక ప్రత్యేక కథనాన్ని ఇప్పుడు విందాం..

(వాయిస్ బైట్...120 సెకన్లు)

==================

విద్య ద్వారానే మహిళల సాధికారత సాధ్యమవుతుందని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. "చట్టసభల్లో మహిళా సాధికారిత" అనే అంశంపై తిరుపతిలో జరిగిన జాతీయ సదస్సులో ఈరోజు ఆయన పాల్గొన్నారు. మహిళా సాధికారత కేవలం మహిళలకు మాత్రమే కాదని అది సమాజాన్ని కూడా వృద్ధి చేస్తుందన్నారు. కుటుంబ సంతోషం ఆ ఇంట్లో మహిళల ఆనందంపై ఆధారపడి ఉంటుందని.. అదే రాష్ట్రానికి, దేశానికి కూడా వర్తిస్తుందన్నారు.

===================

విరామం

===================

వాహన మిత్ర పథకానికి సంబంధించిన దరఖాస్తులను ఈనెల 17వ తేదీ నుంచి గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా స్వీకరించడం జరుగుతుందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకరరెడ్డి తెలిపారు. అక్టోబరు 1వ తేదీన వాహన మిత్ర ప్రారంభం కానుందని ఈ మేరకు ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు. సొంత ఆటో కలిగిన డ్రైవర్లకు వాహనమిత్ర పథకం వర్తిస్తుందని తెలిపారు. దరఖాస్తుదారులు తమ వాహనం ఆంధ్రప్రదేశ్ లో రిజిస్టర్ అయి ఉండటంతో పాటు.. మోటార్ క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ ల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఫిట్నెస్ వంటి సర్టిఫికేట్లు కలిగి ఉండాలనే ప్రభుత్వ నిబంధనలను పాటించాలని ఆయన స్పష్టం చేశారు.

===================

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన భావితరం జీఎస్టీ సంస్కరణల పట్ల ప్రజల నుండి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా రైతులను దృష్టిలో పెట్టుకొని వ్యవసాయానికి అవసరమైన వస్తువులపై జీఎస్టీని తగ్గించడం శుభపరిణామమని అనంతపురానికి చెందిన మురళి ఈరోజు ఆకాశవాణితో మాట్లాడుతూ...

(వాయిస్ బైట్...33 సెకన్లు)

===================

మహిళలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ రూపకల్పన చేసిందని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. మహిళలు, చిన్నారులకు మెరుగైన వైద్య సేవల ద్వారా కుటుంబాలను, తద్వారా సమాజాన్ని ఈ కార్యక్రమం ద్వారా బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దీనిని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 17న ప్రారంభించనున్నారనీ, అదే రోజున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశాఖపట్టణంలో రాష్ట్ర స్థాయిలో ప్రారంభించడం జరుగుతుందన్నారు. అక్టోబరు 2 వరకు జరగనున్న ఈ కార్యక్రమంలో ఆయుష్మాన్ మందిరాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ లలో వైద్య శిబిరాలు, అలాగే అవగాహన శిబిరాలు, సదస్సులు నిర్వహిస్తారని జాయింట్ కలెక్టర్ వెల్లడించారు.

===================

పాడి పరిశ్రమ అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని శ్రీకాకుళం జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కంచరాన రాజగోపాలరావు తెలిపారు. ఈరోజు ఆయన శ్రీకాకుళంలో పాత్రికేయులతో మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా ఈరోజు నుండి అక్టోబర్ 15 వరకు నెలరోజుల పాటు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరుగుతుందన్నారు.

===================

ఆంధ్రప్రదేశ్ మీదుగా దిగువ ట్రోపో ఆవరణములో దక్షిణం, నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా ఉత్తర కోస్తాంధ్రలో రేపు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వెల్లడించింది. బలమైన ఈదురు గాలులు గంటకు 30-40 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.

===================

===================